క్లుప్తంగా

ఏవీఎన్‌లో జాబ్ అచీవర్స్ డే


మాట్లాడుతున్న అతిథి

అల్లిపురం: మిసెస్ ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి వివిధ కంపెనీల ద్వారా ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సీఎంఈ, సివిల్ విభాగానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ బానోజీరావు, గౌరవ అతిథులుగా జోన్–4, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీహెచ్ సంతోష్‌కుమారి, ఏయూ ఫిజిక్స్ విభాగం హెచ్‌వోడీ ఆచార్య వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.వెంకటేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

హారన్ల మోతపై కఠిన చర్యలు


శబ్ద కాలుష్యంలో నడుపుతున్న బుల్లెట్లు స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: తీవ్రమైన శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని, హారన్లు మోగిస్తూ తిరుగుతున్న బుల్లెట్ వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని ప్రయాణిస్తున్న ముగ్గురు ద్విచక్ర వాహనచోదకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.కనకరాజు మాట్లాడుతూ వాహన చోదకులు శబ్ద కాలుష్యంతో కూడిన వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌ను వినియోగించడం తగదన్నారు.

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు


మద్దిలపాలెం కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ కనకరాజు

మద్దిలపాలెం : నగర ట్రాఫిక్ పోలీసు విభాగం ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. మద్దిలపాలెం సిగ్నల్ కూడలి వద్ద మంగళవారం ట్రాఫిక్ ఎస్ఐ కె.కనకరాజు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఇసుకతోట నుంచి నగరంలోకి వస్తున్న వాహనాలతో పాటు, ఇటు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఇసుకతోట వైపు వెళ్లే ద్విచక్ర, ఆటో డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు.

30 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 30న ఉదయం 8 నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, సుందరకాండ పారాయణ, 31న ఉదయం 7 గంటలకు స్వామికి అభిషేకం , సహస్రనామార్చన, సుందరకాండ పారాయణ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6.30గంటలకు పంచామృతాభిషేకం, 7గంటలకు సహస్రనామార్చన, 9గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేక సర్గపారాయణ, 9.30గంటలకు పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులంతా పూజల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చదువుల వనం.. భవిత బంగారం


విశాఖలో తొలి హైస్కూల్ ఏవీఎన్ పాఠశాల

ఘనమైన చరిత్రకు సాక్ష్యంగా నిలిచే ఏవీఎన్ హైస్కూల్ ఎంతో మంది దిగ్గజాలకు విద్యనొసగింది. స్వాతంత్ర్య సమరయోధులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, వైద్యులు, ప్రొఫెసర్లు, సినిమా నటులు.. ఇలా ఏ ఒక్క వర్గం వారో కాకుండా ఈ కళాశాలలో అందరూ చదువుకున్నారు. గొప్పగా ఖ్యాతి గడించారు. అయితే ఎందరినో తీర్చిదిద్దిన ఈ కళాశాల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న అప్పటి డిప్యూటీ కలెక్టర్ ఏవీ నరసింగరావు రూ.లక్ష నగదుతో పాటు 11 ఎకరాల స్థలాన్ని విరాళంగా అందించారు. అప్పటి నుంచి ఆయన సతీమణి పేరిట మిసెస్ అంకితం వెంకట నరసింగరావు హైస్కూల్/కాలేజీగా ఈ కళాశాల పేరు గాంచింది.

- 163 ఏళ్ల ఘన చరిత్ర గల ఏవీఎన్ హైస్కూల్
- విశాఖలో తొలి పాఠశాలగా ఖ్యాతి
- ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు.. కవులు.. రచయితలను తీర్చిదిద్దిన సరస్వతీ ప్రాంగణం


ఏవీఎన్ హైస్కూల్, ఏవీఎన్ కాలేజీల ప్రాంగణం

డాబాగార్డెన్స్: వేలాది రూపాయలు ఖర్చు చేస్తే గాని డిగ్రీలు చేతికి రాని రోజులివి. వీధికొక పాఠశాల.. వాడకొక కళాశాల వెలుస్తున్న ఈ కాలంలో చదువు పరమార్థం పూర్తిగా మారిపోయింది. వందేళ్ల కిందటి చదువులతో పోలిస్తే నేటి చదువులు వెలవెలపోవాల్సిందే. అప్పటి చదువుల్లో విజ్ఞానమే కాక జాతీయ స్ఫూర్తి, సామాజిక బాధ్యత నూరి పోసేవారు. ఆ స్ఫూర్తి ఊరికే పోదు. దాస్య శృంఖలాల నుంచి భరతమాతను విడిపించడంలో నాటి విద్యార్థులు కృతకృత్యులయ్యారు. స్వాతంత్ర్యానికి పూర్వం విద్యల తల్లిగా వెలుగొందిన విశాఖలో మూడు రూపాయల ఖర్చుతో లోయర్ ఫారం, ఏడు రూపాయలతో హయ్యర్ ఫారం పూర్తయ్యేవి. వందేళ్ల కిందట రెండు, మూడు విద్యాలయాలే ఉండేవి. వాటిలో వెయ్యి మంది వరకు విద్యనభ్యసించేవారు. నేటి చదువుల్లా బస్తాల కొద్దీ పుస్తకాలు, సబ్జెక్ట్‌కొక ఉపాధ్యాయుడు లేకపోయినప్పటికీ, విద్యార్థులను పరిపూర్ణ విద్యావంతులుగా తయారు చేసేందుకు అవసరమైన లక్షణాలన్నీ ఆ పాఠశాలలకు ఉండేవి. అటువంటి విద్యాలయాల్లో వన్నెకెక్కింది.. మిసెస్ ఏవీ నరసింహారావు పాఠశాల. ఈ పాఠశాలలో ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు చదువుకున్నారు. జాతీయ స్ఫూర్తిని ఆకళింపు చేసుకున్న ఎంతో మంది నాటి విద్యార్థులు ఉద్యమ స్ఫూర్తితో తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడారు.

ఘన చరిత్ర గల పాఠశాల..

ఏవీఎన్ హైస్కూల్‌కు 163 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 1860లో ఆంగ్లో వెర్నాక్యులర్ స్కూల్‌గా ప్రారంభించిన ఈ స్కూల్లో కేవలం ప్రాథమిక విద్యను మాత్రమే బోధించేవారు. ఈ పాఠశాల అంచెలంచెలుగా ప్రగతి సాధిస్తూ 1878లో సెకండ్ గ్రేడ్ స్థాయికి ఎదిగింది. అప్పట్లో ఈ కళాశాలను హిందూ కళాశాలగా పిలిచేవారు. ఇది మద్రాస్ యూనివర్శిటీకి అనుబంధంగా ఉండేది. అయితే అప్పట్లో ఈ కళాశాల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో అప్పటి డిప్యూటీ కలెక్టర్ ఏవీ నరసింగరావు 1892 మే 8న రూ.లక్ష నగదు పాటు 11 ఎకరాల స్థలాన్ని విరాళంగా అందించారు. ఆయన సహాయంతో నిర్మించిన ఈ భవనం అప్పటి నుంచి ఆయన సతీమణి పేరిట మిసెస్ అంకితం వెంకట నరసింగరావు హైస్కూల్/కాలేజీగా పేరుగాంచింది. ఈ పాఠశాలలో 1938–39లో 732 మంది విద్యార్థులు చదివేవారు. అప్పట్లో సైన్స్ గ్రూప్ పట్ల మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపేవారు. కళాశాలలో 10 నుంచి 15 శాతం విద్యార్థులు సైన్స్ గ్రూపులోనే ఉండేవారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించడమంటే ఏదో గొప్ప విజయాన్ని సాధించినట్టేనని భావించే రోజులవి. స్వాతంత్ర్యానికి ముందు ఉత్తరాంధ్రలో కేవలం విశాఖపట్నం, విజయనగరంలో తప్ప మరెక్కడా పెద్దగా స్కూల్స్ ఉండేవి కావు.


చెక్కు చెదరని నిర్మాణం

ఎందరో మహానుబావులు..

ఈ పాఠశాల నుంచి ఎందరో మహానుబావులు దేశ స్వాతంత్ర్య పోరులో ఉద్యమ బాటపట్టారు. ఎంతో మంది సాహితీవేత్తలు.. రచయితలుగా పేరుగాంచారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), దిగ్గజ సినీ నటుడు ఎస్వీ రంగారావు, ప్రొఫెసర్ సీఆర్ రావు, మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ కె.జె.రావు, ఎంతో మంది జడ్జిలు.. ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు ఈ పాఠశాలలోనే విద్యనభ్యసించారు.

మురుగు, చెత్త నిలవకుండా చర్యలు


జగదాంబ జంక్షన్ వద్ద కాలువలు శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: మురుగు నీరు, చెత్త నిలిచిపోకుండా కాలువలను పరిశుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. మంగళవారం 31వ వార్డులో కాలువలను ఆయన పరిశీలించారు. జోన్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల వంటివి లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

అల్లిపురం: నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఊహల గుసగుసలాడే శీర్షికన శ్రీదేవీ మహానటి సంస్థ నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయకులు ఎంఎస్ మాధవ్ పాడిన ఎదురీతకు అంతం లేదా, మద్దిల అప్పారావు, రమణి పాడిన ఈ మూగ చూపేలా.. సుధీర్, రమణి పాడిన కోటలోని మొనగాడా వంటి గీతాలు శ్రవణానందం కలిగించాయి. కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, సంఘ సేవకులు, సంస్థ కార్యదర్శి విజయరమణి, కోశాధికారి రమణి, గౌరవాధ్యక్షురాలు కందర్ప రాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అమ్మాజీ రావు, అప్పారావు, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం


సమావేశంలో మాట్లాడుతున్న చిన్మయీదేవి

ఎంవీపీ కాలనీ: జిల్లా స్థాయి రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ చిన్మయీదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ఏటా మే 28న నిర్వహిస్తుందన్నారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఆ సమయంలో మహిళల్లోని అపోహలు, అభద్రత భావాన్ని తొలగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అంశంపై బాలికల్లో అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గాజువాక: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గాజువాక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణా శిబిరాలు, ఉపయోగాలు అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, విజేతలకు శిబిరం ముగింపు రోజు బహుమతులను అందజేస్తామని గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వివిధ పాటలకు నృత్యాలు చేశారు.

నత్తనడకన అంగన్‌వాడీ భవనం పనులు


నత్తనడకన సాగుతున్న కల్లుపాకలు అంగన్‌వాడీ కేంద్రం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలు ప్రాంతంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. గత ఏడాది కల్లుపాకలు–2 వద్ద ఈ కేంద్రం పనులు మొదలుపెట్టారు. అప్పటి నుంచి సంవత్సర కాలం దాటినా పనులు పూర్తి కాలేదు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి త్వరితగతిన ఈ భవన నిర్మాణం పూర్తి చేయాలని చుట్టుపక్కల ప్రాంతాల చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం


శిక్షణకు హాజరైన ఎండీఎంలు, ఉపాధ్యాయులు తదితరులు


వంటల పోటీల్లో నిమగ్నమైన ఎండీఎంలు

పెదగంట్యాడ: విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ ఏవీ సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖాధికారి సూచనలతో మండల విద్యా శాఖాధికారి కంకటాల రమణాజీ అధ్యక్షతన నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీల మహిళలకు మధ్యాహ్న భోజనం నిర్వహణపై మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 12న పాఠశాలలు మళ్లీ పునఃప్రారంభం కానున్నాయని తెలిపారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఇష్టంగా మధ్యాహ్న భోజనం తినేలా వంటలు చేసి పెట్టాలని సూచించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన మేరకు సోమవారం నుంచి శనివారం వరకూ ప్రతి రోజూ మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. అనంతరం ఎండీఎం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష పెదగంట్యాడ సీఆర్పీలు, పీటీఐలు, డీటీఐవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు సమతుల్య ఆహారం అవసరం


దేవాడ ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్


ప్రదర్శనలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

పెదగంట్యాడ: కిశోర బాలికలు ప్రొటీన్, ఐరన్‌లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని దేవాడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రాజా సూచించారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడ ఆరోగ్య కేంద్రంలో కిశోర బాలికలకు మంగళవారం మానసిక మహోత్సవం పేరుతో రుతుక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. రుతుక్రమం జరిగే సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.అన్నపూర్ణ, బి.గోపాలం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలతో అనర్థాలు

ఆరోగ్యమే మహాభాగ్యం అని ఏఎస్‌పాలెం అంగన్‌వాడీ టీచర్ కె.ఆబిదాబేగం అన్నారు. జీవీఎంసీ 77వ వారుడ ఏఎస్ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఎండీ సాహెబ్ పేట, అప్పికొండ, ఇస్లాంపేట, దాసరిపేట, మురభాయ్, మదీనాబాగ్, చాపలపాలెం, పలికలదొడ్డి అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి మంగళవారం రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

'ఐఎన్‌టీయూసీతోనే కార్మిక సమస్యల పరిష్కారం'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కమ్యూనిస్టు కార్మిక సంఘాలతో కార్మికులు విసుగు చెందారని, అందులో భాగంగా అనేక మంది ఐఎన్‌టీయూసీలో చేరుతున్నారని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. మంగళవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద ఎస్టీఎం విభాగం మహిళా ఉద్యోగి రత్నశ్రీ ఐఎన్‌టీయూసీలో చేరారు. ఆమెకు రాజశేఖర్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించగలిగే సత్తా ఐఎన్‌టీయూసీకి మాత్రమే ఉందన్నారు.

సాహితీ సౌరభం

1966లో దొండపర్తిలోని నెహ్రూబజార్ సమీపంలో స్థాపించబడిన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం తదనంతర కాలంలో ఆ పక్కనే ఉన్న పాఠశాల మేడ మీదకు మార్చారు. ఈ గ్రంథాలయంలో నవలలు, చిన్న పిల్లలు ఇష్టపడే కథల పుస్తకాలు, కామిక్స్, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు అవసరమయ్యే సైన్స్, మ్యాథ్స్ వంటి అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వేసవిలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు, నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి.. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్నారు.

- చక్కటి సేవలందిస్తున్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం
- పాఠకులకు అందుబాటులో 80 వేల పుస్తకాలు
- పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రాధాన్యం


గ్రంథాలయంలో పాఠకులు




నెహ్రూబజార్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం

సీతమ్మధార: దొండపర్తిలో ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం సాహితీ సౌరభాలు వెదజల్లుతోంది. 1966లో ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇక్కడ దాదాపు 80 వేల వరకు వివిధ రకాల పుస్తకాలున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడే అనేక పుస్తకాలను ఇక్కడ పొందుపరిచారు. అలాగే పాఠకులు ఇష్టపడే నవలలు, పిల్లలకు నచ్చే కామిక్స్, రంగు రంగుల కథల పుస్తకాలు ఇక్కడున్నాయి. అలాగే రాజకీయ శాస్త్రం, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు, హిందీ చదువరుల కోసం పలు రకాల గ్రంథాలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. ఈ గ్రంథాలయం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుంది. రోజూ ఇక్కడికి వందకు పైగా విద్యార్థులు, పాఠకులు వస్తుంటారు. గ్రంథాలయ కర్తలు పైడిరాజు, వీపీ పద్మావతిదేవి పర్యవేక్షణలో సిబ్బంది ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ప్రతి గురువారం, రెండో శనివారం సెలవు దినంగా పాటిస్తున్నారు. ఈ గ్రంథాలయంలో ఏడు వేల మంది సభ్యత్వం కలిగి వున్నారు.

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ..

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు ఇక్కడ రోజూ ఉదయం పూట స్పోకెన్ ఇంగ్లీష్, కథా పఠనం, పాటల వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. జూన్ 7వ తేదీన జరిగే ముగింపు ఉత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాండిచ్చేరి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఈ గ్రంథాలయానికి 160 పుస్తకాలు విరాళంగా అందజేశారు. జేడీ ఫౌండేషన్ యాజమాన్యం మూడు టేబుళ్లు, 20 కుర్చీలు, మూడు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు విరాళంగా అందించారు.

ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన దాదాపు 30 మంది యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ ఏటా నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.


ర్యాకుల్లో అందంగా అమర్చి ఉన్న పుస్తకాలు


లైబ్రేరియన్ పద్మావతీదేవి

హైకోర్టులో ఉద్యోగం వచ్చింది..

దొండపర్తి ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు చదివి పరీక్షలకు హాజరయ్యాను. మంచి మార్కులు సాధించటంతో హైకోర్టులో ఉద్యోగం వచ్చింది. గ్రంథాలయ అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాను. ఇక్కడ ప్రతి విద్యార్థికి ఉపయోగపడే పుస్తకాలున్నాయి. అలాగే సాహిత్యం, కామిక్స్, పిల్లల కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.



–జగన్‌మోహన్

అందుబాటులో 80 వేల పుస్తకాలు..

ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో 80 వేల వరకు పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జి బుక్స్ విద్యార్థుల కోసం ఇక్కడ పొందుపరిచాం. ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదువుకుని ఎంతో మంది ఉద్యోగాలు సంపాదించారు. గ్రంథాలయ సేవలను పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.



–వీపీ పద్మావతిదేవి, లైబ్రేరియన్,

కల్వర్టు బాగు చేయరూ..


వెలంపేట వద్ద రంధ్రం పడిన కల్వర్టు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట వద్ద కల్వర్టుకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పెద్ద రంధ్రం ఏర్పడిన ఈ కల్వర్టుతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆ రంధ్రంపై చెక్క వేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రాత్రి వేళ్లలో మాత్రం వాహన చోదకులు, మందుబాబులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కల్వర్టుపై సిమెంట్ పలక వేసి రంధ్రం మూసివేయాలని వెలంపేట వాసులు కోరుతున్నారు.